సాక్షి
అనంతపురం

మంగళవారం। 6। జూన్। 2023



చీనీ టన్ను రూ.38 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.38 వేలు పలికాయి.



ఏడీ బాధ్యతల స్వీకరణ

జిల్లా సర్వే భూ రికార్డుల శాఖ నూతన ఏడీగా నియమితులైన రూప్లానాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

గరిష్టం/కనిష్టం
42.3°/23.4°

జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. మధ్యాహ్నం వరకు వేసవితాపం, ఉక్కపోత అధికంగా ఉంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమై తేలికపాటి జల్లులు పడ్డాయి.

మొదలైన డ్రిప్, స్ప్రింక్లర్ల పంపిణీ

- రైతుల కోసం ప్రత్యేకంగా కాల్ సెంటర్ ఏర్పాటు
- 42 వేల హెక్టార్లకు 30 వేల మంది రైతుల రిజిస్ట్రేషన్



పంటకు ఏర్పాటు చేసిన డ్రిప్

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో డ్రిప్, స్ప్రింక్లర్ల (బిందు, తుంపర సేద్య పరికరాల) పంపిణీ మొదలైంది. రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా 'అనంత'లో తొలివిడతగా 164 మంది రైతులకు 205 హెక్టార్లకు సరిపడా డ్రిప్ మంజూరైంది. ఈ మేరకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది 12,500 హెక్టార్లు లక్ష్యం నిర్దేశించిన విషయం తెలిసిందే. గతేడాది మాదిరిగానే 5 ఎకరాల్లోపున్న చిన్న సన్నకారు రైతులకు 90 శాతం, ఆపైన 10 ఎకరాల వరకు 70 శాతం రాయితీతో డ్రిప్ యూనిట్లు ఇస్తున్నారు. ఇక ఐదెకరాల వరకు 55 శాతం, 5 నుంచి 12.50 ఎకరాల వరకు 45 శాతం రాయితీతో స్ప్రింక్లర్లు పంపిణీ చేస్తున్నారు.

కాల్‌సెంటర్ ఏర్పాటు

ఆర్‌బీకే వేదికగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులను సీనియార్టీ వారీగా గుర్తించి క్షేత్రస్థాయి పరిశీలన, బీటక్యూ, బీఎంఎస్, నాన్ సబ్సిడీ చెల్లింపు తర్వాత మంజూరు, మెటీరియల్ సరఫరా, ఇన్‌స్టాలేషన్, ట్రయల్‌రన్... ఇలా క్రమపద్ధతిలో రైతులకు పరికరాలు పంపిణీ చేయడానికి వీలుగా ఏపీఎంఐపీ జిల్లా కార్యాలయంలో ప్రత్యేకంగా కాల్‌సెంటర్ ఏర్పాటు చేశారు. రైతులు నేరుగా సంప్రదించడం లేదా 08554-249397 నంబర్‌కు కాల్ చేసి వివరాలు తెలుసుకునే అవకాశం కల్పించారు. కాగా ఇప్పటికే ఆర్‌బీకే వేదికగా 30 వేల మంది రైతులు 42 వేల హెక్టార్లకు డ్రిప్, స్ప్రింక్లర్లు కావాలని ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని ఆ శాఖ ప్రాజెక్టు (పీడీ) డైరెక్టర్ జి.ఫిరోజ్‌ఖాన్ తెలిపారు.

నగదు చెల్లింపులు వద్దు

డ్రిప్, స్ప్రింక్లర్ల పంపిణీకి సంబంధించి నగదు రూపంలో చెల్లింపులు ఉండవని పీడీ తెలిపారు. ప్రతిదీ డిజిటల్ పద్ధతి లేదా యూపీఐ విధానంలో ఉంటుందని పేర్కొన్నారు. రైతులు ఈ విషయాన్ని గుర్తుంచుకుని ఎవరికీ నగదు చెల్లించవద్దని ప్రత్యేకంగా తెలియజేశారు. ఓపిక లేని రైతులు తమ వాటా చెల్లించాలంటూ కొందరు కంపెనీ ప్రతినిధులకు నగదు ఇస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీని వల్ల భవిష్యత్తులో రైతులు ఇబ్బంది పడే పరిస్థితి ఉంటుందన్నారు. కంపెనీ డీలర్లు, ఏపీఎంఐపీ సిబ్బంది... రైతుల నుంచి నగదు తీసుకున్నట్లు ఫిర్యాదు అందితే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఏదైనా సమస్య వచ్చినా, సమాచారం అవసరమైనా కాల్‌సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు.

అర్జీలపై నిర్లక్ష్యం సహించం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: 'స్పందన'లో ప్రజల నుంచి అందే అర్జీలు, 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో వచ్చే అర్జీల పరిష్కారంలో ఏస్థాయిలోనూ నిర్లక్ష్య ధోరణిని ఉపేక్షించబోనని కలెక్టర్ గౌతమి అధికారులను గట్టిగా హెచ్చరించారు. అర్జీలకు సంతృప్తికర పరిష్కారం చూపించాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'స్పందన'లో ప్రజల నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయత్రిదేవి, ఆర్‌డీఓ మధుసూదన్, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు కేశవనాయుడు, సుధారాణి వివిధ సమస్యలపై ప్రజల నుంచి 409 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమం అనంతరం అర్జీల పరిష్కారంపై కలెక్టర్ సమీక్షించారు. అర్జీల పరిష్కారంలో కొందరు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. సమస్య పరిష్కారం కాకపోయినా పరిష్కరించినట్లుగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారన్నారు. ఇలా చేయడం వల్ల అర్జీ రీ-ఓపెన్ అవుతుందన్నారు. ఇకపై అర్జీలు రీ-ఓపెన్ కాకూడదన్నారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యను క్షుణ్ణంగా తెలుసుకుని నిర్దేశిత గడువుకు ముందే సంతృప్తి చెందేలా పరిష్కరించాలని ఆదేశించారు.

అడుగంటిన తుంగభద్ర జలాశయం



బొమ్మనహాళ్: తుంగభద్ర డ్యాంలో నీరు అడుగంటింది. ప్రస్తుతం ఐదు టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి 39.400 టీఎంసీల నీరు నిల్వ ఉండి, 2,564 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండేది. డ్యాంలో ప్రస్తుతం 1581.04 అడుగుల వద్ద నీటి మట్టం ఉంది. సోమవారం ఇన్‌ఫ్లో 889 క్యూసెక్కులుగా నమోదైంది. దీంతో జలాశయంలో ఆశించిన స్థాయిలో నీరులేక కళ తప్పింది. కర్ణాటకతో పాటు ఆంధ్రాలోని అనంతపురం, వైఎస్సార్, కర్నూలు జిల్లాలకు సాగు, తాగునీరు అందిస్తున్న టీబీ డ్యాంకు గతేడాది మే నెలలోనే భారీగా వరద నీరు చేరగా జూలైలో పూర్తిస్థాయిలో నిండి పలుసార్లు డ్యాం 33 గేట్లు ఎత్తి నదికి నీటిని విడుదల చేసిన సంగతి తెలిసిందే. జలాశయం పైభాగంలోని ఆగుంబే, వరనాడు, శివమొగ్గ, తీర్థనహళ్లి, శృంగేరి తదితర ఉత్తర కర్ణాటక ప్రాంతాల్లో ఇంకా వర్షాలు మొదలు కాకపోవడంతో డ్యాం నీరు లేక బోసిపోయింది. అయితే ఆగస్టు వరకు వర్షాలు కురిసే అవకాశాలు ఉండడంతో రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఆస్తులు పంచుకుని అమ్మను నెట్టేసి!

- కొడుకు, కోడలు వేధింపులతో రోడ్డున పడిన వృద్ధురాలు
- స్థానికుల సాయంతో ఎస్పీ దృష్టికి సమస్య

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఆ వృద్ధురాలికి ముగ్గురు కుమారులున్నారు. ఆస్తిపాస్తులు బిడ్డలకు సమానంగా పంచి ఇచ్చింది. అయినా ఓ కుమారుడు, కోడలు వేధింపులు ఆగలేదు. దిక్కుతోచని స్థితిలో రోడ్డున పడిన ఆ వృద్ధురాలు.. సోమవారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయ సమీపంలో మండు టెండలో కాళ్లు కాలిపోతుంటే ఓ అరుగుపై కూలబడింది. విషయాన్ని గమనించిన అటుగా వెళుతున్న వారు ఆమెకు సపర్యలు చేసి, పరిస్థితిని ఆరా తీస్తే అసలు విషయం వెలుగు చూసింది. దీంతో వెంటనే ఆమెను పోలీసు స్పందన కార్యక్రమానికి తీసుకెళ్లి ఎస్పీ కె.శ్రీనివాసరావు ఎదుట హాజరుపరిచారు.

15 ఎకరాలు పంచి..

'అయ్యా, నా పేరు చెన్నమ్మ. ఆలుమూరు గ్రామం. ముగ్గురు కొడుకులు, ఓ కుమార్తె ఉంది. అందరికీ పెళ్లిళ్లు చేశా. నాకున్న 15 ఎకరాల భూమిని బిడ్డలకు సమానంగా పంచిచ్చా. ఇల్లూ వాకిలి కూడా పంచుకున్నారు. ఆ మహానుభావుడు వైఎస్ రాజశేఖరరెడ్డి ఇచ్చిన ఇంట్లో ప్రస్తుతం తలదాచుకుంటున్నా. ఇప్పుడు ఆ ఇంటిని కూడా తమకివ్వాలని ఓ కొడుకు, కోడలు వేధిస్తున్నారు. చావుకు రోజులు లెక్కపెడుతున్న నాకు ఆ దేవుడు ఎన్ని కష్టాలిచ్చాడో చూడయ్యా?' అంటూ ఎస్పీ శ్రీనివాసరావు ఎదుట వృద్ధురాలు కన్నీటిపర్యంతమైంది. స్పందించిన ఎస్పీ వెంటనే ఆమె ఆవేదనను అర్జీ రూపంలో స్వీకరించి, ముగ్గురు కొడుకులతో పాటు కుమార్తెను స్టేషన్‌కు పిలిపించి వృద్ధురాలి పర్యవేక్షణ బాధ్యతలతో పాటు ఆమె ప్రశాంత జీవనానికి చర్యలు తీసుకోవాలంటూ అనంతపురం రూరల్ పోలీసులకు సిఫారసు చేశారు.




అర్జీని పరిశీలిస్తున్న ఎస్పీ కె. శ్రీనివాసరావు, ఎస్పీ కార్యాలయం వద్ద దిగాలుగా కూర్చున్న చెన్నమ్మ

- తన బావ వేధింపులపై పోలీసులను ఆశ్రయిస్తే వారే అన్యాయం చేసేందుకు సిద్ధమయ్యారంటూ ఎస్పీ శ్రీనివాసరావుకు కూడేరు మండలం ముద్దలాపురం గ్రామానికి చెందిన వెంకటేశ్వరి ఫిర్యాదు చేసింది. స్పందన కార్యక్రమంలో ఎస్పీని కలసి వినతి పత్రాన్ని అందజేసింది. తన భర్త మరణానంతరం తనకు సంక్రమించిన భూమిని సాగు చేసుకుంటానంటే నమ్మి బావకు ఆమె అప్పగించింది. ఇప్పుడు ఆ భూమిలో తనకు వాటా ఉందని వేధింపులకు గురి చేస్తుండడంతో పోలీసుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి న్యాయం చేయాలని అభ్యర్థిస్తే ఎస్ఐ ఆమెకు వ్యతిరేకంగా మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల్లో బావ పేరు చేరుస్తానని బెదిరిస్తున్నాడంటూ ఎస్పీ ఎదుట బాధితురాలు కన్నీటి పర్యంతమైంది. తన పొలంలోకి అడుగు కూడా పెట్టనివ్వకుండా ఎస్ఐ అడ్డుపడుతుండడంపై ఆవేదన వ్యక్తం చేసింది. కాగా, స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 128 వినతులు అందాయి. ప్రతి అర్జీదారుడితో ఎస్పీ స్వయంగా మాట్లాడి, సమస్య తీవ్రతను అడిగి తెలుసుకున్నారు.

క్లుప్తంగా

విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

సాక్షి ఎఫెక్ట్..

కణేకల్లు: కణేకల్లు విద్యుత్ సబ్ స్టేషన్‌లో మందు పార్టీ నిర్వహించిన కణేకల్లు లైన్ ఇన్‌స్పెక్టర్ నరసింహరావును సస్పెండ్ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. పవిత్రమైన ప్రభుత్వ కార్యాలయ వాతావరణాన్ని మందు పార్టీలతో భ్రష్టు పట్టిస్తున్న వైనంపై 'సబ్ స్టేషన్‌లో మందుపార్టీ' శీర్షికతో సోమవారం 'సాక్షి'లో వెలువడిన కథనంపై ఆ శాఖ ఎస్ఈ సురేంద్ర స్పందించారు. ఘటనకు సంబంధించి సంబంధిత ఏడీ, ఈఈతో ఆరా తీశారు. మందు పార్టీలు పెట్టి విద్యుత్‌శాఖ పరువు తీస్తున్నారంటూ మండిపడ్డారు. దీంతో ఎస్ఈ ఆదేశాల మేరకు నరసింహరావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఈఈ శేషాద్రి శేఖర్ స్పష్టం చేశారు. కాగా, మందు పార్టీ ఘటనపై విచారణాధికారిగా కళ్యాణదుర్గం రూరల్ ఏడీ శ్రీనివాసనాయుడును నియమించినట్లు సమాచారం. ఘటనపై తుది నివేదికను నెలలోపు అందజేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు తెలిసింది.

వృద్ధురాలి బలవన్మరణం

సోమందేపల్లి: కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపం చెందిన ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. సోమందేపల్లి మండలం చల్లాపల్లి గ్రామానికి చెందిన నర్సయ్య భార్య అక్కమ్మ (59) శనివారం రాత్రి కుటుంబసభ్యులతో ఘర్షణ పడి ఇల్లు విడిచి వెళ్లిపోయింది. అనంతరం ఆమె ఆచూకీ కోసం కుటుంబసభ్యులు గాలించినా ఫలితం దక్కలేదు. సోమవారం మధ్యాహ్నం గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో అక్కమ్మ మృతదేహాన్ని గుర్తించిన స్థానికుల సమాచారం మేరకు కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ విజయ్ కుమార్, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.



బావిలో తేలుతున్న అక్కమ్మ మృతదేహం

పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోండి



మొక్క నాటి నీరు పోస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

బుక్కరాయసముద్రం: పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రజలకు ఎస్పీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం బీకేఎస్ మండలం సిద్దరాంపురం పోలీస్ హౌసింగ్ కాలనీలో అదనపు ఎస్పీలు విజయ భాస్కర్‌రెడ్డి, హనుమంతు, ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్‌తో కలసి ఆయన మొక్కలు నాటి, మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా రెండు మొక్కలు నాటి, వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతపురం రూరల్ డీఎస్పీ వి.శివారెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, శింగనమల సీఐ అస్రార్‌బాషా, బీకేఎస్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ విజయభాస్కర్, ఈఓఆర్డీ దామోదరమ్మ, ఏపీఓ శ్రీదేవి, సర్పంచ్ కొండన్న, బుల్లే నారాయణస్వామి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహాక్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాలి
- కలెక్టర్ గౌతమి

అనంతపురం టౌన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు ప్లాస్టిక్ రహిత సమాజాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ గౌతమి పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాలుష్య నియంత్రణ మండలి, అటవీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 7.30 గంటలకు ర్యాలీని కలెక్టర్ గౌతమి, అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి ప్రారంభించారు. ర్యాలీలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు, స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం కృష్ణ కళామందిరం ఆవరణలో మొక్కలు నాటి నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగం, శానిటేషన్‌పై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరముందన్నారు. మొక్కల పెంపకాన్ని బాధ్యతగా స్వీకరించాలన్నారు. ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ వాతావరణ కాలుష్యంతో సమస్త జీవకోటికి ప్రమాదమన్నారు. ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలన్నారు. కార్పొరేషన్ పరిధిలో 9 కిలోమీటర్ల మేర మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపట్టామన్నారు. అనంతరం పర్యావరణంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ సందీప్ కృపాకర్, పొల్యూషన్ బోర్డు ఈఈ శంకర్రావు, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్లు కొగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ గౌతమి, ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తదితరులు

లింగ నిర్ధారణ పరీక్షలపై కఠినంగా వ్యవహరించాలి

లింగ నిర్ధారణ పరీక్షల విషయంలో కఠినంగా వ్యవహరించాలని జిల్లా వైద్యాధికారులను కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై ఆరోగ్యశాఖ రూపొందించిన పోస్టర్లను కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌తో కలసి సోమవారం ఆమె విడుదల చేశారు. ఇదే సమయంలో అతిసార వ్యాధి నివారణ కార్యక్రమ పోస్టర్లనూ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్ఓ గాయత్రీదేవి, డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి, డీఐఓ డాక్టర్ యుగంధర్, ట్రైనీ కలెక్టర్ కుశాల్ జైన్, ఆర్డీఓ మధుసూదన్, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు కేశవనాయుడు, సుధారాణి పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా భూముల రీ సర్వే

'వైఎస్సార్ - జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష' పథకం కింద సమగ్ర రీ-సర్వే కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, ఈ ప్రక్రియలో భాగమైన అన్నిస్థాయిల ఉద్యోగులు బాధ్యతతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ గౌతమి సూచించారు. గ్రామ సర్వేయర్లకు ప్రభుత్వం మంజూరు చేసిన రీ-సర్వే కిట్‌లను సోమవారం ఆమె అందజేసి, మాట్లాడారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్ఓ గాయత్రీదేవి, ట్రైనీ కలెక్టర్ కుశాల్ జైన్, సర్వే భూ రికార్డుల శాఖ ఏడీ కిషోర్ బాబు, ఆర్డీఓ మధుసూదన్, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనను బాధ్యతగా తీసుకుని ఈ నెల 30వ తేదీ వరకూ ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో కార్మిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి, మాట్లాడారు. ఈ నెల 12న ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, కార్మిక శాఖ ఉప కమిషనర్ రఘురాములు, డీఎంహెచ్ఓ వీరబ్బాయి, డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పాటిల్ గోవిందరెడ్డి సేవలు చిరస్మరణీయం

బ్రహ్మసముద్రం : మండలంలోని బొమ్మగానిపల్లి వాసులకు పాటిల్ గోవిందరెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని మంత్రి ఉషశ్రీచరణ్ కొనియాడారు. బొమ్మగానిపల్లి పంచాయతీ వంకతండాలో పాటిల్ గోవిందరెడ్డి జ్ఞాపకార్థం రెండు ఎకరాల సాగు భూమిని పేదల ఇళ్ల స్థలాల కోసం కుమారులు పాటిల్ తిమ్మారెడ్డి, కుమార్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి(సర్పంచ్), భార్గవ్‌రెడ్డి వితరణ చేశారు. ఈ భూమిలో దాదాపు 70 మంది గిరిజనులకు ఇళ్ల పట్టాలను సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి ఉషశ్రీచరణ్ హాజరై పాటిల్ గోవిందరెడ్డి కాలనీ పేరు పెట్టి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మూడు దశాబ్దాలుగా గ్రామస్తులకు గోవిందరెడ్డి కుటుంబసభ్యులు అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా మంత్రి కొనియాడారు. వీఆర్వోగా గోవిందరెడ్డి నిస్వార్థ సేవలు అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ రామాంజినేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవరాజు, ప్రచార కమిటీ కార్యదర్శి అశోక్ రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేశ్‌నాయక్, జీవీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్‌నాయక్, పాటిల్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

రోడ్డు ప్రమాదంలో తమిళనాడు వాసి మృతి

నల్లచెరువు: స్థానిక జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో తమిళనాడు వాసి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... తమిళనాడులోని ధర్మపురికి చెందిన జ్యోతి కుమార్ (33), ప్రభాకరన్ అనంతపురంలో నివాసముంటూ చిప్స్ తయారీ, వ్యాపారంతో జీవనం సాగిస్తున్నారు. వ్యాపారరీత్యా తనకల్లుకు వచ్చిన వారు సోమవారం ఉదయం తమ బొలెరో వాహనంలో అనంతపురానికి తిరుగు ప్రయాణమయ్యారు. నల్లచెరువు మండలం దేవిరెడ్డిపల్లి సమీపంలోకి చేరుకోగానే జాతీయ రహదారిపై ఏపీ మోడల్ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ల వద్ద ముందు వెళుతున్న లారీ స్లో కావడాన్ని గమనించకుండా వేగంగా వెనుక నుంచి ఢీకొన్నారు. ఘటనలో బొలెరో నడుపుతున్న జ్యోతి కుమార్ వాహనంలోనే ఇరుక్కుపోయి మృతి చెందాడు. పక్కనే కూర్చొన్న ప్రభాకరన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేఋకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.



ఇరుక్కుపోయిన జ్యోతికుమార్ మృతదేహం

జీసీడీఓగా వాణీదేవి



రాప్తాడు రూరల్: సమగ్ర శిక్ష గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (జీసీడీఓ)గా వాణీదేవి నియమితులయ్యారు. ఈ మేరకు కలెక్టర్ గౌతమి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేజీబీవీల నిర్వహణలో కీలకమైన జీసీడీఓ పోస్ట్ కొద్దిరోజులుగా ఖాళీగా ఉంది. భర్తీకి రెండుసార్లు నోటిఫికేషన్ ఇచ్చారు. మూడు దరఖాస్తులు వచ్చాయి. ఇంటర్వ్యూలో గార్లదిన్నె మండలం మర్తాడు జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు వాణీదేవి ఎంపికయ్యారు. కాగా, గతంలోనూ ఆమె జీసీడీఓగా పని చేశారు. విద్యాశాఖ ఆర్జేడీ నుంచి రిలీవ్ ఉత్తర్వులు రాగానే ఆమె జీసీడీఓగా చేపట్టనున్నారు.

బొలెరో ఢీకొని ఆటో ప్రయాణికుడి మృతి

బెళుగుప్ప: బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఓ వృద్ధుడు మృతి చెందాడు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... బెళుగుప్ప మండలం నరసాపురం గ్రామానికి చెందిన పలువురు సోమవారం ఉదయం ఆటోలో కళ్యాణదుర్గానికి బయలుదేరారు. గ్రామ శివారులో జాతీయ రహదారిపైకి చేరుకోగానే వేగంగా దూసుకొచ్చిన బొలెరో వాహనం వెనుక నుంచి ఢీకొంది. ఘటనలో ఆటో నుజ్జునుజ్జైంది. ఆటో వెనుక కూర్చొని ప్రయాణిస్తున్న వెంకటేశులు (60) రెండు కాళ్లు ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న విజయ్, రామాంజినేయ, గంగమ్మ, నారాయణమ్మ, వెంకమ్మ, కమలమ్మ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను కళ్యాణదుర్గం సీహెచ్‌సీలో చేర్పించారు. ఘటనపై ఎస్ఐ రామకృష్ణయ్య కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతుడు వెంకటేశులుకు భార్య పద్మ, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.



వెంకటేశులు (ఫైల్)

బాలికపై అత్యాచారం

హిందూపురం: నమ్మి ఇంటికి వచ్చిన బాలికపై మేనమామ అత్యాచారానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు... హిందూపురంలోని రహమత్‌పుర ప్రాంతానికి చెందిన ఓ మాంసం వ్యాపారి భార్యకు రెండేళ్ల క్రితం కవలలు జన్మించారు. ఈ క్రమంలో పిల్లలను చూసుకునేందుకు అప్పుడప్పుడు అదే ప్రాంతంలో నివాసముంటున్న 8వ తరగతి చదువుతున్న తన చెల్లెలు కుమార్తె వచ్చి పోతుండేది. ఈ క్రమంలో తన భార్య నిద్రిస్తున్న సమయంలో ఆ బాలికపై మూడు రోజులుగా మేనమామ అత్యాచారం చేస్తూ వచ్చాడు. విషయాన్ని ఇతరులకు చెబితే చంపేస్తానని బెదిరించడంతో లోలోన మదనపడుతున్న బాలికను గమనించి తల్లి ఆరా తీసింది. దీంతో అసలు విషయం తల్లికి తెలిపి బాలిక బోరున విలపించడంతో ఘటనపై హిందూపురం రెండో పట్టణ పోలీసులకు బాలిక తల్లి ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ కృష్ణారెడ్డి తెలిపారు.

వ్యక్తి దుర్మరణం

రొద్దం: ప్రహరీని ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహనదారుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు...రొద్దంలోని కొత్త ఎస్సీ కాలనీ నివాసి సన్యాసి గోవిందు (43)కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. బేల్దారి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. వ్యక్తిగత పనిపై సోమవారం ఉదయం కర్ణాటకలోని కొడిమొడుగుకు వెళ్లిన గోవిందు.. తిరిగి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఆర్.మరువపల్లి పాత చెక్‌పోస్టు వద్ద పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న రైస్ మిల్ ప్రహరీ గోడను ఢీకొన్నాడు. ఘటనలో తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ నాగస్వామి అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.



మృతుడు గోవిందు

'పది' సప్లిమెంటరీ పరీక్షకు 572 మంది గైర్హాజరు

రాప్తాడురూరల్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్ష (ఇంగ్లిష్)కు సోమవారం 572 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 49 కేంద్రాల్లో 1,124 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉంది. డీఈఓ సాయిరాం రెండు కేంద్రాలు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ ఒక కేంద్రం, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 18 కేంద్రాలను పరిశీలించారు.

సమస్యలు ఉంటే కార్యాలయానికి రండి

ఆత్మకూరు: మండలంలో ఏవైనా రెవెన్యూ శాఖకు సంబంధించి సమస్యలు ఉంటే తహసీల్దార్ కార్యాలయానికి రావాలని డిప్యూటీ తహసీల్దార్ వెంకట ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కొద్ది రోజులుగా ఆత్మకూరులో తహసీల్దార్ లేనందున, ఆ బాధ్యతలను అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ చూశారు. ఈ నెల 12 వరకు ఆయన ఆత్మకూరులోనే ఉంటారని, ఏ సమస్యలు ఉన్నా కార్యాలయానికి వచ్చి సమస్యలను తెలియజేయాలని ఆయన తెలిపారు.

నగరాభివృద్ధికి సహకరించండి

అనంతపురం క్రైం: నగరాభివృద్ధికి సహకరించాలని మేయర్ వసీం కేంద్ర మంత్రి భూపేంద్రయాదవ్‌ను కోరారు. సోమవారం ఢిల్లీలో కేంద్రమంత్రిని మేయర్ మర్యాద పూర్వకంగా కలసి, వినతి పత్రం అందజేశారు. వెనుకబడిన అనంతపురం జిల్లాను దృష్టిలో ఉంచుకొని, పర్యావరణ పరిరక్షణకు సంబంధించి తమ నగరంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

పర్యావరణ దినోత్సవంలో పాల్గొన్న మేయర్..

ఢిల్లీలోని విజ్ఞాన భవన్‌లో సోమవారం జరిగిన అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవంలో మేయర్ వసీం పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రం నుంచి అనంతపురం మేయర్ వసీం, విజయవాడ మేయర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



కేంద్రమంత్రి భూపేంద్ర యాదవ్‌తో మాట్లాడుతున్న మేయర్ వసీం

నేడు గడప గడపకూ...

అనంతపురం క్రైం: నగరంలోని ఐదో డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్‌లో మంగళవారం ఉదయం 6.30 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి సోమవారం ప్రకటన విడుదల చేశారు. శ్రీనివాస్‌నగర్‌లోని రిలయన్స్‌మార్ట్‌కు వెళ్లే మార్గం నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

అనంతపురం: ప్రపంచ విప్లవకారుడు చేగువేరా జయంతి సందర్భంగా ఐద్వా, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఆల్ అనంతపురం చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెస్‌పోటీలు అనంతపురం ఆర్ట్స్ కళాశాలలోని డ్రామా హాల్‌లో సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలతోనే మానసికోల్లాసం సాధ్యమన్నారు. ప్రస్తుతం యాంత్రిక జీవనంలో పిల్లలు సెల్‌ఫోన్ ద్వారా మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారు అన్నారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలకృష్ణ, నరసింహులు, ఐద్వా జిల్లా కార్యదర్శి రాజ్యలక్ష్మి, చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఉదయకుమార్ తదితరులు పాల్గొన్నారు.